విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com

ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

TELTEL/2012/47103

తెలుగు జాతీయ దిన పత్రిక


సంపుటి : 12 సంచిక :92 నల్గొండ | గురువారం 26-06-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ | పేజీలు : 4 | వెల : రూ.1/-


## స్థానిక సంస్థల ఎన్నికలపై తొలగిన అనిశ్చితి




హైదరాబాద్,జూన్25: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న అనిశ్చితి తొలగింది. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. సెప్టెంబర్ 30లోగా తప్పనిసరిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. గత కొంత కాలంగా గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ స్థానాలకు ఎన్నికలు జరగకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్త పరుస్తున్నారు. ఈ అంశంపై ఆరుగురు మాజీ సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. వారు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన అనంతరం హైకోర్టు ఈ తీర్పును వెల్లడించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వ తరఫున న్యాయవాదులు రిజర్వేషన్ల పక్రియ పూర్తి చేయడానికి కనీసం మరో 30 రోజుల గడువు అవసరం అని తెలపడంతో హైకోర్టు ఆ అభ్యర్థనని పరిగణనలోకి తీసుకుంది. దీనితో రిజర్వేషన్ల పక్రియ పూర్తయిన తర్వాత, ఎన్నికల నిర్వహణకు మరో 60 రోజులు కావాలన్న రాష్ట్ర ఎన్నికల సంఘం అభ్యర్థనకు కూడా కోర్టు అంగీకారం తెలిపింది. దీనివల్ల కలిపి గరిష్ఠంగా 90 రోజుల లోపుల ఎన్నికల పక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనితో, 2025 సెప్టెంబర్ 30వ తేదీ లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై పడనుంది. స్థానిక పాలన లోపిస్తున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, ప్రజాప్రతినిధులు లేని పాలన వల్ల గ్రామీణాభివృద్ధి ఇబ్బందిగా మారుతుందని పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాలలో నూతన అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడం, పథకాల అమలు జాప్యం కావడం వల్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వారు కోర్టుకు విన్నపించుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. గ్రామపంచాయతీ ఎన్నికలు 3 నెలల్లో నిర్వహించాలని, 30 రోజుల్లో వార్డుల విభజన పక్రియ పూర్తి చేయాలని ఆదేశిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి బుధవారం తీర్పు వెలువరించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు 2024 జనవరి 30వ తేదీతో ముగిసినా ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ప్రశ్నించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక పోవడాన్ని సవాలు చేస్తూ పలువురు మాజీ సర్పంచులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ టి.మాధవిదేవి తీర్పు ఇచ్చారు. తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసినా.. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించింది. ఇది రాజ్యాంగ, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధం. ప్రత్యేక అధికారులు ఇతర విధుల్లో ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరుస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచులు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. ప్రస్తుతం ఆ నిధులు అందక ఇబ్బందులుపడుతున్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడంలేదు. వెంటనే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలి' అని కోరారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల పక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. ఈ పక్రియ పూర్తికావడానికి మరో నెల రోజుల గడువు అవసరమని కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తికాగానే ఎన్నికల పక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపాక.. పక్రియ పూర్తి చేయడానికి రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున... ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. న్యాయవాది సమాధానమిస్తూ.. రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి మూడు నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు.

## ఎమర్జెన్సీపై అమిత్ షా ఘాటు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,కాంగ్రెస్ పార్టీపై కేంద్ర హెూమంత్రి అమిత్‌షా ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రకటించిన అత్యవసర పరిస్థితిజాతీయ అవసరం కాదని.. కాంగ్రెస్ ప్రజాస్వామ్య వ్యతిరేక మనస్తత్వానికి అది ప్రతీక అని అమిత్ షా ఆరోపించారు. కేవలం తన పదవిని కాపాడుకోవడానికి మాత్రమే అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 1975, జూన్ 25న అత్యవసర పరిస్థితిని విధించారన్నారు. ఆ సమయంలో దేశంలో పత్రికా స్వేచ్ఛను హరించివేశారని, న్యాయవ్యవస్థ చేతులు కట్టేశారని, సామాజిక కార్యకర్తలను జైళ్లలో బంధించారని షా పేర్కొన్నారు. దీంతో ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడ్డారని తెలిపారు. ప్రభుత్వం నియంతలా మారినప్పుడు, దానిని పడగొట్టే శక్తి ప్రజలకు ఉంటుందని ఈ రోజు అందరికీ గుర్తు చేస్తోందని షా అన్నారు.

ఎమర్జెన్సీ నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలు

అత్యవసర పరిస్థితి సమయంలో దేశంలోని ప్రజలు ఎన్నో హింసలు, బాధలు ఎదుర్కొన్నారని అమిత్ షా అన్నారు.అప్పుడు వారు ఎదుర్కొన్న సమస్యలను నేటితరానికి తెలియజేయడానికి భాజపా ప్రభుత్వం జూన్ 25ను 'సంవిధాన్ హత్య దివస్'గా పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో ప్రతి భారతీయుడిలో వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రజాస్వామ్య రక్షణ వంటి విషయాలపై అవగాహన కల్పించడమే తమ ఉద్దేశమని అన్నారు. తద్వారా కాంగ్రెస్ వంటి నియంతృత్వ శక్తులు మళ్లీ అటువంటి భయానక సంఘటనలను పునరావృతం చేయకుండా ఉంటాయని వ్యాఖ్యానించారు.

"పత్రికా స్వేచ్ఛ, న్యాయ వ్యవస్థ అణచివేతకు గురయ్యాయి"

సరిగ్గా 50 ఏళ్ల క్రితం 1975 జూన్ 25న ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించారు. అంతర్గత కారణాల వల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లినట్లు పేర్కొంటూ నాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీఅహ్మద్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 352 కింద ఎమర్జెన్సీ ప్రకటించారు. ఈ కాలంలో దేశ పౌరులు, పత్రికల ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ తీవ్ర అణచివేతకు గురయ్యాయి. సుమారు 1.5 లక్షల మంది జైలు పాలయ్యారు.

ప్రజాస్వామ్య యాత్ర ప్రారంభం ఢిల్లీ నుండి దేశవ్యాప్తంగా

1977, మార్చి 21 వరకు ఇది కొనసాగింది. దీంతో నాటి పరిస్థితులను వ్యతిరేకిస్తూ.. కేంద్ర ప్రభుత్వం బుధవారం దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహించనుంది. కేంద్రమంత్రి అమిత్ షాఆధ్వర్యంలో ఢిల్లీలో నేడు 'ప్రజాస్వామ్య యాత్ర'ను ప్రారంభించనున్నారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య హక్కులు,ఎమర్జెన్సీ నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలపై అవగాహన పెంచేందుకు ఈ యాత్రను దేశవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ వెల్లడించింది. ప్రభుత్వం నియంతగా మారినపుడు, దాన్ని తిరస్కరించే శక్తి ప్రజల చేతిలోనే ఉంటుంది. ఎమర్జెన్సీ నాటి పోరాటం దీన్ని స్పష్టం చేసింది.

## రైతు భరోసా పథకం ఎత్తేస్తారు..



హైదరాబాద్, తెలంగాణ భవన్ లో నేడు (బుధవారం) మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్ లు ప్రెస్ మీట్ నిర్వహించారు. రాష్ట్రంలోని సమకాలీన పరిస్థితుల మధ్య మంత్రులు పలు కీలక వ్యాఖ్యలు చేసారు.ఈ సమావేశంలో భాగంగా మాజీమంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతు సంబరాలు చేయడానికి ఈ ప్రభుత్వం కు అర్హత లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రాళ్లు, రప్పలకు రైతు బందు ఇచ్చారని తప్పు పట్టారన్నారు. అయితే ఇప్పుడు కూడా మేము ఇచ్చిన 70 లక్షల మంది రైతులకే మీరు కూడా రైతు భరోసా ఇచ్చారు కదా.. అంటే మీరు కూడా రాళ్లు, రప్పలకు, అనర్హులైన రైతులకే డబ్బులు ఇచ్చారా అని ప్రశ్నించారు.అంతేకూండా, స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి హడావుడి చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతు భరోసా పథకం ఎత్తివేయబోతుందని హాట్ కామెంట్స్ చేసారు. కేసీఆర్ లేఖ రాస్తే అసెంబ్లీలో చర్చ పెడతాం అనడం ఏంటి..? గతంలో కేసీఆర్ అసెంబ్లీలో అన్ని విషయాలు చెప్పారన్నారు. మీకు దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టండి.. మా వాళ్లు మాట్లాడుతారని, కేసీఆర్ ఎప్పుడు వచ్చి మాట్లాడాలో మీరు చెప్పడం ఏంటిని ఆయన అన్నారు. బనకచర్ల గురించి మాట్లాడమంటే, కాళేశ్వరం.. కూలేశ్వరం.. అంటున్నాడు ఈ సీఎం రేవంత్ రెడ్డి అని ఎద్దేవా చేసారు.అలాగే ఈ సమావేశంలో పాల్గొన్న మాజీమంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. వరదను అయినా తట్టుకోవచ్చు.. కానీ, రేవంత్ రెడ్డి నోట్లో నుంచి వచ్చే అబద్ధాల వరదను ఎవరూ తట్టుకోలేకపోతున్నారన్నారు. మీకు మా కేసీఆర్ కాదు.. ఏ బీఆర్ఎస్ కార్యకర్త అయినా సమాదానం చెప్తాడన్నారు. మా కేసీఆర్ 11 సార్లు 80 వేల కోట్లు ఇచ్చినా మేము ఇంత హంగామా చేయలేదని.. రుణమాఫీ విషయంలో కేటీఆర్ విసిరిన ఛాలెంజ్ కు సమాధానం లేదన్నారు. మళ్లీ ఇప్పుడు కేసీఆర్ రావాలి అంటున్నాడు.. 85 వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయల కుంభకోణం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. తమ్మిడి హట్టి దగ్గర 152 మీటర్ల అడుగుల ఎత్తులో మీరు కట్టండి కట్టలేక పోతే రేవంత్ రెడ్డి మిమ్మల్ని ఉరి తీయాలా అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసారు. పొలాల రేట్లు తగ్గాయని, రేవంత్ రెడ్డిని తెలంగాణకు పట్టిన శని అనుకుంటున్నారని ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మిమ్మల్ని బొంద పెట్టబోతున్నారని ఎద్దేవా చేసారు.

## ఇరాన్ న్యూక్లియర్ వ్యవస్థను దెబ్బతీసాం



వాషింగ్టన్,జూన్25: ఇరాన్‌పై జరిగిన అమెరికా వైమానిక దాడులు ఆ దేశ న్యూక్లియర్ సౌకర్యాలను పూర్తిగా ధ్వంసం చేశాయని డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నారు. కానీ పలు మీడియా నివేదికల నేపథ్యంలో ఇరాన్.. న్యూక్లియర్ కార్యక్రమాన్ని కొన్ని నెలలు మాత్రమే వాయిదా వేశాయని చెబుతున్నాయి. ఈ నివేదికలను ట్రంప్ నకిలీ వార్తలని తోసిపుచ్చారు. ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఎ÷-లాట్‌ఫామ్‌లో ఒక పోస్ట్‌లో ఇలా పేర్కొన్నారు. ఈ వార్తలు ప్రచురించే సీఎన్ఎన్, న్యూయార్క్ టైమ్స్‌లు కలిసి ఈ చారిత్రక విజయవంతమైన సైనిక దాడిని చిన్నబుచ్చే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇరాన్‌లోని న్యూక్లియర్ సౌకర్యాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ మీడియా సంస్థలు ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాయని ట్రంప్ తెలిపారు. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా ఈ నివేదికలను పూర్తిగా తప్పు అని తిరస్కరించారు. ఈ నివేదికలు ట్రంప్‌ను అవమానించేందుకు చేసిన ప్రయత్నమని ఆమె అన్నారు. 14 లక్షల కిలోల బాంబులను ఖచ్చితంగా లక్ష్యంపై వేస్తే ఏమవుతుందో అందరికీ తెలుసని అన్నారు. డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (ఆఎం) నివేదిక ప్రకారం, జూన్ 22న అమెరికా ఇరాన్‌లోని మూడు న్యూక్లియర్ కేంద్రాలైన ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్‌లపై దాడులు జరిపింది. అయితే ఈ దాడుల్లో ఇరాన్ న్యూక్లియర్ ప్రధాన భాగాలను ధ్వంసం కాలేదని , కేవలం కొన్ని నెలల తర్వాత వాయిదా వేశారని ఈ నివేదిక చెబుతోంది. ఈ సౌకర్యాలకు నష్టం జరిగినప్పటికీ, ఇరాన్ న్యూక్లియర్ మౌలిక సౌకర్యాలు చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని తెలుస్తోంది. ఈ షయంపై సమాచారం ఇచ్చిన ఇద్దరు వ్యక్తులు, గుర్తింపు వెల్లడించకుండా, ఈ దాడులు ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ సౌకర్యాలకు నష్టం కలిగించినప్పటికీ, వాటిని పూర్తిగా ధ్వంసం చేయలేకపోయాయని చెప్పారు. ఇరాన్‌లోని అత్యంత సుసంపన్నమైన యురేనియం కొన్ని స్థలాల నుంచి దాడులకు ముందే తరలించబడి సురక్షితంగా ఉందని, సెంట్రిఫ్యూజ్‌లు కూడా చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని వారు తెలిపారు. ఫోర్డోలోని లోతైన భూగర్భ యురేనియం శుద్ధి కర్మాగారం వద్ద ప్రవేశ ద్వారం కూలిపోయింది. మౌలిక సౌకర్యాలకు నష్టం జరిగింది. అయితే, భూగర్భంలోని ప్రధాన నిర్మాణాలు ధ్వంసం కాలేదని ఒక వ్యక్తి తెలిపారు. గతంలో జరిగిన అంచనాలు కూడా ఈ ఫలితాన్ని హెచ్చరించాయని ఆ వ్యక్తి చెప్పారు. ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ దాడులు పూర్తి విజయవంతమయ్యాయని చెప్పినప్పటికీ, డిఐఏ నివేదిక వారి వాదనలను ఖండిస్తోంది. ఈ దాడులు ఇరాన్ న్యూక్లియర్ కార్యక్రమాన్ని గణనీయంగా దెబ్బతీసినప్పటికీ, దానిని పూర్తిగా నాశనం చేయలేకపోయాయని నివేదిక స్పష్టం చేస్తోంది. ఇది అమెరికా, ఇజ్రాయెల్ నాయకుల వాదనలకు విరుద్ధంగా ఉంది. ఈ వివాదం ప్రస్తుతం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

## రైతు భరోసాపై రేవంత్ రెడ్డి,హరీశ్‌రావుల మధ్య మాటల యుద్ధం

హైదరాబాద్,రైతు భరోసా కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకుడు, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధమని, తెలంగాణకు జరుగుతున్న ద్రోహాన్ని గణాంకాలతో సహా నిరూపిస్తానని 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) వేదికగా సవాల్ విసిరారు. ఈ సవాల్‌తో పాటు, రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు పలు తీవ్రమైన విమర్శలు గుప్పించారు.ప్రభుత్వ కార్యక్రమంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి సంస్కారం లేని విధంగా మాట్లాడి తన 'చిల్లర బుద్ధిని' మరోసారి ప్రదర్శించారని హరీశ్‌రావు ఆరోపించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సాధించిన అద్భుత ప్రగతిని తక్కువ చేసి చూపడం ద్వారా రాష్ట్ర ప్రజలను అవమానించారని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపుపై భరోసా లేకపోవడంతోనే విధిలేని పరిస్థితుల్లో రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. లక్ష కోట్లు కూడా ఖర్చుకాని కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందనడం ప్రపంచం నవ్విపోతోందని ఆయన ఎద్దేవా చేశారు.

%ఖుతీఅంష్ట్ర =ఖశీ%: రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు

కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు, డిమాండ్లు

మేడిగడ్డలో కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయలేని వారు ఇప్పుడు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా కూలాయని అంటున్నారని, ఇది 'నోరా మోరా' అని హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు. దమ్ముంటే, ఇసుమంతైనా నిజాయితీ ఉంటే 30 లక్షల మంది కౌలు రైతులకు ఇస్తానన్న రైతు భరోసా పథకాన్ని అమలు చేసి మాట్లాడాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా, సన్న వడ్లకు రూ.1,200 కోట్ల బోనస్ బకాయిలను రైతుల ఖాతాల్లో తక్షణమే వేయాలని కోరారు. తమను హామీలపై ప్రశ్నిస్తున్నందుకే బూతులతో చెలరేగుతున్నారని, అయినా తాము సంయమనం కోల్పోబోమని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలు అమలయ్యేంత వరకు అబద్ధాల పుట్టను బద్దలు కొడుతూనే ఉంటామని హెచ్చరించారు.

రాజకీయ ఆరోపణలు, సవాళ్లు




చివరగా, "గెలిచిన వాడు రాజు, ఓడిపోయిన వాడు రావణాసురుడు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్న వ్యాఖ్యలపై హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. ఈ సూత్రాన్ని అన్వయించుకుంటే, లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన రాహుల్ గాంధీ కూడా రావణాసురుడేనా అని నిలదీశారు. ఈ వ్యాఖ్యల ద్వారా తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం మరింత ముదిరే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై బహిరంగ చర్చ జరుగుతుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

### అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి

హైదరాబాద్,ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో మొక్కలు నాటాలని మేడ్చల్ జిల్లా బీజేపీ కన్వీనర్ మల్లారెడ్డి, కూకట్‌పల్లి నియెజకవర్గ ఇన్‌చార్జ్ మాధవరం కాంతరావు, మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. మూసాపేటలో ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశాన్ని కాలుష్యరహితంగా మార్చాలన్న ఉద్దేశంతో ప్రధాని మోదీ పిలుపు ఇచ్చారని, మన ఇంటికి ఇరువైపులా, ఖాళీ ప్రదేశాలు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అడవులు రోజురోజుకు అంతరించి పోతున్నాయని దానివల్ల వర్షాలు తగ్గడమే కాకుండా సూర్యతాపం మరింత పెరుగుతుందన్నారు.

## ఎమర్జెన్సీ బాధలు అనుభవాలపై పుస్తకం..




న్యూఢిల్లీ,జూన్25: దేశంలో ఎమర్జెన్సీ విధించి జూన్ 25తో 50 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఆనాడు ఎదురైన పరిస్థితులు, ఇబ్బందులపై 'ది ఎఎమర్జెన్సీ డైరీస్' పేరుతో ప్రత్యేక పుస్తకాన్ని తీసుకొస్తున్నట్లు ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ ద్వారా మోడీ వెల్లడించారు. అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు తాను ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ఉన్నట్లు తెలిపారు. ఆ సమయంలో తన ప్రయాణం ఎలా సాగిందో డైరీలో ఉందని చెప్పుకొచ్చారు. ఎమర్జెన్సీ కాలంలో చాలామందికి అనుభవాలు ఉన్నాయని.. ఎన్నో కుటుంబాలు బాధపడ్డాయని గుర్తుచేశారు. ఆనాటి పరిస్థితుల్ని యువతకు అవగాహన కల్పించాలని కోరారు. చీకటి రోజులను సోషల్ మీడియా ద్వారా పంచుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో 1975 నుంచి 1977 వరకు చీకటి రోజులుగా మోడీ అభివర్ణించారు. ఆనాటి పరిస్థితులపై మోడీ తొలి రాజకీయ జీవితంపై బ్లూక్రాఫ్ట్ డిజిటల్ ఫౌండేషన్ 'ది ఎమర్జెన్సీ డైరీస్-ఇయర్స్ దట్ ఫోర్జ్డ్ ఎ లీడర్' పేరుతో కొత్త పుస్తకాన్ని ఆవిష్కరించింది. మోడీ వ్యక్తిగత జీవితం..రాజకీయ ప్రస్థానం.. రాజకీయ నిరంకుశత్వాన్ని ప్రతిఘటించడం లో.. ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో మోడీ పాత్ర ఏంటన్న విషయాలు ఈ పుస్తకంలో పొందిపరిచారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయంలో ఎమర్జెన్సీని ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా మోడీ ఎలా ఎదుర్కొన్నారో.. వాటి గురించి వివరణాత్మకంగా పుస్తకంలో ఉన్నాయని బ్లూక్రాఫ్ట్ డిజిటల్ ఫౌండేషన్ వెల్లడించింది.

సంపాదకీయం

గురువారం 26-06-2025

# ఏఐ యుగంలో చదువు చెప్పేదెలా?

కృత్రిమ మేధ(ఏఐ) పరిశోధనాశాలల నుంచి మానవ జీవితంలోకి వచ్చేసింది. మన జీవన శైలినీ, బోధన– అభ్యసనాలనూ, పని విధానాన్నీ మార్చేస్తోంది. కొత్త ఏఐ యుగానికి విద్యార్థులను తయారు చేయాలంటే పాత కాలపు బోధనా పద్ధతులు, పాఠ్య ప్రణాళికలు పనికిరావు. కృత్రిమ మేధ(ఏఐ) పరిశోధనాశాలల నుంచి మానవ జీవితంలోకి వచ్చేసింది. మన జీవన శైలినీ, బోధన– అభ్యసనాలనూ, పని విధానాన్నీ మార్చేస్తోంది. కొత్త ఏఐ యుగానికి విద్యార్థులను తయారు చేయాలంటే పాత కాలపు బోధనా పద్ధతులు, పాఠ్య ప్రణాళికలు పనికిరావు. సరికొత్త అవసరాలకు అనుగుణంగా, మారిన పరిస్థితులకు తగినట్లుగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరముంది. రాబోయే అయిదేళ్లలో వృత్తి ఉపాధులకు అవసరమైన నైపుణ్యాలలో 40 శాతం మారిపోతాయని ప్రపంచ ఆర్థిక వేదిక తాజా ‘ఉద్యోగ నివేదిక–2025’ తెలిపింది. సమస్య పరిష్కారం దిశగా ఆలోచించడం (అల్గోరిథమిక్ థింకింగ్), ఏఐ నుంచి మనకు కావాల్సిన సమాధానాలను రాబట్టే ప్రాంప్ట్ ఇంజినీరింగ్ నైపుణ్యం, డేటా సిస్టమ్స్‌లో పక్షపాతాన్ని పసిగట్టే శక్తిని విద్యార్థులకు అలవరచడం ఉపాధ్యాయుల బాధ్యత కానుంది. ఏఐకి సాధ్యం కాని సహానుభూతి, విచక్షణా జ్ఞానం, నైతిక ప్రమాణాలకు అనుగుణమైన తార్కిక శక్తి, తోటివారితో కలిసి పనిచేయడం వంటి గుణగణాలను విద్యార్థుల్లో పాదుగొల్పాలి.

హానికరమా, లాభదాయకమా?

జనరేటివ్ ఏఐ ఇప్పటికే ప్రపంచ విద్యారంగంలో పెనుమార్పులు తీసుకొస్తోంది. వీటిని అందిపుచ్చుకోవడంలో గురువులకన్నా శిష్యులే ముందుంటున్నారు. 25శాతం విద్యార్థులు ఇప్పటికే అలవాటుగా జనరేటివ్ ఏఐ టూల్స్‌ను వాడుతుండగా, ఉపాధ్యాయుల్లో 10శాతం కూడా దాన్ని అలవాటు చేసుకోలేదని వివిధ అధ్యయనాలు చెబుతున్నాయి. ఏఐ రైటింగ్ టూల్స్‌ను సగంమంది విద్యార్థులు కనీసం ఒక్కసారైనా వినియోగించగా, 71శాతం ఉపాధ్యాయులు ఒక్కసారి కూడా వాడలేదు. మరోవైపు, హోంవర్క్ చేయడానికీ, పరీక్షలు రాయడానికీ విద్యార్థులు ఏఐని వాడుతున్న సందర్భాలు పెరుగుతున్నాయి. ఇలా కాపీకొట్టి పరీక్షలు ఉత్తీర్ణులయ్యేవారు భవిష్యత్తులో నీతినియమాలను, చట్టాన్ని గౌరవించే పౌరులుగా ఎలా ఎదుగుతారు? పైగా ఏఐ ఇచ్చే సమాచారమంతా నూటికి నూరు శాతం కచ్చితమైనది కాదు. కొన్ని ఏఐ చాట్‌బాట్లు 80శాతం కచ్చితత్వాన్ని మాత్రమే కనబరచగలుగుతున్నాయి. ఇవి రకరకాల వర్గాల సమాచారాన్ని క్రోడీకరించి సమాధానాలిస్తాయి. ఆ సమాచారంలోని తప్పులు, వివక్ష, పక్షపాతం ఏఐ చాట్‌బాట్ల సమాధానాలలో ప్రతిఫలిస్తాయి. కాబట్టి సొంత తార్కిక శక్తి, విచక్షణ, సృజనాత్మకతను పెంపొందించుకున్న విద్యార్థులు, ఉద్యోగులు మాత్రమే ఏఐ టూల్స్‌ను సమర్థంగా, సక్రమంగా వాడగలుగుతారు. గురువులు, శిష్యులు డేటా గోప్యతను గౌరవించాలి. సామాజిక–నైతిక చట్రానికి భంగం కలిగించకుండా ఏఐని ఉపయోగించాలి. ఏఐని అధికంగా వాడటం వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య బంధం తగ్గిపోతుంది. దీర్ఘకాలంలో విద్యార్థుల సామాజిక నైపుణ్యాలు, భావోద్వేగపరమైన మేధస్సు ఎదగకుండా పోతాయి. అదీకాకుండా ఆంగ్ల భాషలో ప్రావీణ్యం లేనివారు ఏఐని సమర్థంగా ఉపయోగించలేక వెనకబడిపోతారు. కాబట్టి స్థానిక భాషల్లో కృత్రిమ మేధా వనరులను మెరుగుపరచుకోవాలి. ఏఐని ఎప్పటికప్పుడు ఆధునికీకరిస్తూ ఉండాలి. దాని వినియోగంలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలి. దీనంతటికయ్యే ఖర్చును వర్ధమాన దేశాలు భరించలేవు. ఆ దేశాల్లో కూడా ధనిక, మధ్యతరగతి, పేద వర్గాల విద్యార్థుల మధ్య డిజిటల్ అంతరం పెరిగిపోతుంది. ఇలాంటి సమస్యలను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలి.

కొరవడిన మార్గదర్శకాలు

ప్రపంచంలో అనేక అధికాదాయ దేశాలు ఇప్పటికే తరగతి గదుల్లో ఏఐని ప్రవేశపెట్టగా, భారత్ ఇప్పుడిప్పుడే బుడిబుడి అడుగులు వేస్తోంది. కానీ, మన దేశంలో ఏఐ వినియోగంపై స్పష్టమైన మార్గదర్శకాలు కొరవడ్డాయి. తన అసైన్‌మెంట్‌లో ఏఐని ఉపయోగించాడనే కారణంపై హరియాణాలోని ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ ఒక విద్యార్థిని ఫెయిల్ చేసింది. దీన్ని అతడు హైకోర్టులో సవాలు చేశాడు. ఏఐని ఉపయోగించడమంటే కాపీ కొట్టడం కాదని వాదించాడు. ఏఐని చదువులో ఉపయోగించకూడదని విశ్వవిద్యాలయం ఎక్కడా పేర్కొనలేదని కోర్టు దృష్టికి తెచ్చాడు. దీన్ని ఉన్నత విద్యాసంస్థలు గమనించాలి. ఏఐ సాధనాల వినియోగానికి కచ్చితమైన ప్రమాణాలు, తనిఖీలు, సమతూకాలు ఉండాలి. వాటిని రూపొందించి అమలులో పెట్టే బాధ్యతను యూజీసీ తక్షణం చేపట్టాలి. అన్నట్టు ఏఐని పాఠ్య ప్రణాళికలో పొందుపరచడంలో యూజీసీకన్నా సీబీఎస్ఈ ముందుంది. 9 నుంచి 12వ తరగతి వరకు ఏఐని ఒక పాఠ్యాంశంగా సీబీఎస్ఈ ప్రవేశపెట్టింది. ఐబీఎంతో కలిసి జనరేటివ్ ఏఐ మీద స్కిల్స్‌బిల్డ్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఉపాధ్యాయులకు శిక్షణ సామగ్రి, వాస్తవిక అనుభవాలపై ఆధారపడిన ఉదాహరణలు అందిస్తోంది. కౌన్సిల్ ఫర్ ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్స్ (సీఐఎస్‌సీఈ) పాఠ్య ప్రణాళికలో రోబోటిక్స్, ఏఐ పాఠాలను చేర్చింది.

శక్తిమంతమైన సాధనం

కొన్నేళ్ల క్రితం ప్రపంచమంతటా బడి పిల్లలకు కంప్యూటర్ వినియోగంలో ప్రాథమిక పరిజ్ఞానం అలవరచడం ప్రారంభమైంది. ఇప్పుడు ఏఐ పరిజ్ఞానం తప్పనిసరి అవుతోంది. అంతమాత్రాన ఏఐ ఉపాధ్యాయుల స్థానాన్ని భర్తీ చేస్తుందని పొరబడరాదు. అది గురువులకు శక్తిమంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. రోజువారీ పాఠాలను సిద్ధం చేసుకోవడానికీ, ప్రశ్నపత్రాలను రూపొందించడానికీ, అసైన్‌మెంట్లకు గ్రేడ్లు ఇవ్వడానికీ, నిర్వహణ సంబంధ పనులకు ఏఐ తోడ్పడుతుంది. దీనివల్ల గురువులపై దైనందిన పనుల ఒత్తిడి తగ్గి సృజనాత్మక బోధనా రీతులపై దృష్టి పెట్టడానికి వీలుకలుగుతుంది. విద్యార్థులకు అధిక సమయం ఇవ్వగలుగుతారు. ఏ కొత్త సాంకేతిక పరిజ్ఞానమైనా మన కోసమే పని చేయాలి తప్ప, మనం సాంకేతికతకు కూలీగా మారకూడదు. అదీకాకుండా ఏఐపై అతిగా ఆధారపడితే విద్యార్థుల్లో తార్కిక శక్తి, లోతుగా విశ్లేషించే సత్తా, సమస్యా పరిష్కార సామర్థ్యం బలహీనపడతాయని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. సమస్యల పరిష్కారంపై లోతుగా ఆలోచించినప్పుడే విద్యార్థుల్లో మేధాశక్తి సుసంపన్నమవుతుంది. ఏఐని ఎప్పుడు, ఎంత మోతాదులో ఉపయోగించాలో, ఎప్పుడు వాడకూడదో విద్యార్థులకు గురువులే బోధించాలి. తదనుగుణంగా పాఠశాల నుంచి పీహెచ్‌డీ స్థాయి వరకు ఏఐ వినియోగంపై స్పష్టమైన నియమావళిని

# కవిత పెట్టిన చిచ్చు.. బీఆర్ఎస్ నేతల్లో అయోమయం




హైదరాబాద్, గులాబీ పార్టీలో ఏం జరుగుతోంది..? ఒకప్పుడు జిల్లా పర్యటనకు కవిత వస్తున్నారంటేనే ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు ఎందుకు ముఖం చాటేస్తున్నారు..? కవిత పర్యటనల్లో పాల్గొంటే అధిష్టానం సీరియస్ అవుతుందన్న భయమా లేదంటే మరేదైనా కారణం ఉందా..? ఓవైపు కారు పార్టీ ఎమ్మెల్సీగా కవిత కొనసాగుతున్నా.. గులాబీ నేతలు అంటీముట నట్లుగా వ్యవహరించడం వెనుక మతలబేమైనా ఉందా..? అసలేంటి మ్యాటర్..?

కవిత విషయంలో బీఆర్ఎస్ విషయంలో నేతల్లో డైలమా

ఒక్క లేఖ.. ఒకే ఒక్క లేఖతో బీఆర్ఎస్‌లో పరిస్థితి అంతా మారిపోయిందట. అప్పటి నుంచి మొదలైన కాక రోజురోజుకూ పెరిగి పెద్దదవుతూ అనేక పరిణామాలకు దారి తీస్తోందట. అసలు లేఖ ఏంటి.. బీఆర్ఎస్‌లో అది పుట్టిస్తున్న కాక ఏంటన్నది చూసేముందు ప్రస్తుతం గులాబీ పార్టీలో నెలకొన్న పరిస్థితిని ఓసారి గమనిస్తే.. ఎమ్మెల్సీ కవిత విషయంలో బీఆర్ఎస్ నేతల్లో హైడ్రామా నెలకొందట. ఇంకా చెప్పాలంటే అధినేత కేసీఆర్ గారాలపట్టి అయిన కవిత పర్యటనల్లో పాల్గొంటే.. పరిస్థితి ఎటుపోయి ఎటు వస్తుందోనన్న భయం నెలకొందట.

గతంలో కవిత వస్తున్నారంటేనే నేతల్లో ఎంతో హడావిడి

నిజానికి బీఆర్ఎస్‌లో వివిధ పదవులు నిర్వహించారు కవిత. ప్రస్తుతం పార్టీ తరపున ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. అయితే.. గతంలో ఎప్పుడైనా కవిత జిల్లా పర్యటనకు వస్తున్నారంటే చాలు గులాబీ పార్టీ నేతలు చేసే హడావిడి అంతా ఇంతా ఉండేది కాదనే చెప్పాలి. దగ్గరుండి స్వాగతం చెప్పడం మొదలు ఆమె నోటి నుంచి ఎలాంటి ఆదేశాలు వస్తాయని ఎదురు చూసేవారట గులాబీ నేతలు.

ఎదురెల్లి మరీ స్వాగతాలు పలికేవారు

ఎంతో మంది కారు పార్టీ నేతలు కవిత చుట్టూ చక్కర్లు కొడుతుండే వారు. ఆమె దృష్టిలో పడేందుకు ప్రయత్నించేవాళ్లు. ఇంకా చెప్పాలంటే కవిత ఒక్క మాట చెప్పారంటే చాలు అధినేత కేసీఆర్ వద్ద అభయం లభించినట్లేనన్న టాక్ సైతం గతంలో విన్పించింది. ఆ క్రమంలోనే పలువురు పెద్ద నేతలు పదవులు పొందారు. ఇక చోటా మోటా పదవులైతే లెక్కేలేదు.

గతంలో పరిస్థితికి.. ఇప్పటికీ ఎంతో తేడా

కానీ, ఇప్పుడు మాత్రం సీన్ మారిందనే టాక్ పార్టీలోనే విన్పిస్తోందట. ఎమ్మెల్సీ కవిత చేపడుతున్న కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు మినహాయిస్తే పేరున్న నేతలు ఎవరూ పెద్దగా పాల్గొనడం లేదన్న టాక్ కేడర్ నుంచే విన్పిస్తోంది. అంతేకాదు.. ఇదంతా గమనించిన కవిత పార్టీ నాయకులతోనే ఈ విషయం అన్నారట.

కవిత లేఖ వ్యవహారంతో మారిన సీన్

అయితే.. ఇక్కడే కొన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో కవితతో కలిసి నడిచేందుకు పోటీ పడిన నేతలు ఎందుకు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారు..? ఆమె పాల్గొన్న కార్యక్రమంలో పార్టిసిపేట్ చేసేందుకు పోటీ పడిన వారు ఇప్పుడు ఎందుకు పక్కకు తప్పుకుంటున్నారు అంటే.. విన్పించే మాట.. ఒక్క లేఖ.

తాను రాసిన లేఖ ఎలా లీకేందన్న కవిత

ఢిల్లీ మద్యం కుంభకోణంలో జైలుకు వెళ్లడం.. అనంతర పరిణామాలపై పార్టీ అధినేత కేసీఆర్‌కు కొన్ని రోజుల క్రితం ఓ లేఖ రాశారు కవిత. అయితే.. ఆ లేఖ లీక్ కావడం బీఆర్ఎస్‌లో ప్రకంపనలు పుట్టించింది. పార్టీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, తనకు ఎదురైన అనుభవాలు.. ఇలా పలు అంశాలపై తన అభిప్రాయన్ని%ౌ% తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్‌కు లెటర్ రూపంలో రాశారు ఎమ్మెల్సీ కవిత. అలాంటి లెటర్ ఎలా లీక్ అయిందన్నది ఆమె ప్రధాన ప్రశ్న. దీనిపైనే అమెరికా నుంచి వచ్చిన తర్వాత ప్రశ్నాస్త్రాలు సంధించారు కవిత. తనలాంటి వ్యక్తి రాసిన లెటరే లీకైతే.. ఇక మిగిలిన నేతలు, కార్యకర్తల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారామె.

కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయంటూ కవిత కామెంట్స్

ఇక్కడితే ఆగలేదు ఎమ్మెల్సీ కవిత. గులాబీ బాస్ కేసీఆర్ దేవుడే కానీ, ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయంటూ ఆరోపించారామె. వాళ్ల వల్లే పార్టీకి నష్టం జరుగుతోందని మండిపడ్డారు. కవిత చేసిన ఈ కామెంట్లు బీఆర్ఎస్‌లోనే కాదు.. తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టించాయి.

కవిత వ్యాఖ్యలపై రియాక్టైన కేటీఆర్

కవిత లేఖ కాక పుట్టించడంతో పార్టీ తరపున స్పందించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కవిత సోదరుడు కేటీఆర్. పార్టీలో అంతర్గతంగా నెలకొన్న విషయాలను ఇంటర్నల్‌గా మాట్లాడితేనే మంచిదని అభిప్రాయపడ్డారు. ఏ స్థాయిలో ఉన్న నేతలైనా బహిరంగంగా మాట్లాడడం కరెక్ట్ కాదని చెప్పుకొచ్చారు కేటీఆర్.

కవిత పార్టీ అగ్రనేలకు మధ్య పెరిగిన దూరం

కవిత కామెంట్లకు, కేటీఆర్ కౌంటర్ సంగతి ఎలా ఉన్నా.. ఒక విషయంపై మాత్రం విస్తృతంగా చర్చ జరిగింది. అదే.. ఎమ్మెల్సీ కవిత ఆరోపించినట్లుగా కేసీఆర్ దేవుడు అయితే.. మరి దెయ్యాలు ఎవరు అన్నది తెలంగాణ పాలిటిక్స్‌లో చర్చనీయాంశంగా మారింది. దీనిపై ప్రత్యర్థి పార్టీల నేతలు విమర్శల బాణాలు ఎక్కు పెట్టడంతో బీఆర్ఎస్ ఇంటర్నల్ పాలిటిక్స్ కాస్తా రాష్ట్ర పాలిటిక్స్‌గా మారిన పరిస్థితి నెలకొంది.

ఎందుకొచ్చిన తంటా అంటూ మొఖం చాటేస్తున్న నాయకులు

ఇక, అప్పటి వరకు ఇంటర్నల్‌గా సాగిన విభేదాలు కవిత లేఖ లీక్ వ్యవహారం నుంచి రచ్చకెక్కాయి. దీనికి కేటీఆర్ కామెంట్లు జతకావడంతో పార్టీకి చెందిన సీనియర్లు, బడా నాయకులు ఎందుకొచ్చిన తంటా అని మౌనం వహించారట. దీనికి తోడు పార్టీ తరపున ఎమ్మెల్సీగా ఉన్నా కవిత మాత్రం జాగృతి తరపున తన కార్యక్రమాలు చేపడుతూ పోతున్నారు. జాగృతిలోకి వచ్చిన వారికి కండు వాలు కప్పడంతోపాటు తాను స్వయంగా బీసీ రిజర్వేషన్లు, బనకచర్ల వివాదం సహా మరికొన్ని అంశాలు ప్రస్తావిస్తూ ముందుకు సాగుతున్నారు.

ఇప్పటికైనా పరిస్థితిలో మార్పు వస్తుందా?

ఓవైపు కేటీఆర్, హరీశ్‌రావు సహా ఇతర నేతలు అన్నట్లుగా ఉంటే.. మరోవైపు ఎమ్మెల్సీ కవిత ఒక్కరే కన్పిస్తున్నారు.

దీంతో.ఎటు వైపు ఉండాలో తేల్చుకోలేక పోతున్నారట గులాబీ సీనియర్ నేతలు. ఇప్పటికైనా పరిస్థితిలో మార్పు వస్తుందా లేదంటే తమకు ఇబ్బందులు తప్పవా లోలోన గుబులు చెందుతున్నా రట.

### ఓయూ పరిధి పరీక్షలా ఫలితాలు విడుదల

హైదరాబాద్,ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్షల రివాల్యుయేషన్ ఫలితాలతో పాటు ఎంపీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, బీసీఏ అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామన్నారు.

# స్థానిక ఎన్నికల్లో మోదీ మంత్రం పనిచేస్తుందా?

హైదరాబాద్, బీజేపీ స్థానిక సంస్థలను ఎలా ఎదుర్కొందామనే మల్లగుల్లాలు పడుతుందా? అధికార, ప్రతిపక్ష పార్టీలకు కౌంటర్ అటాక్స్ ఇవ్వలేనీ నేతల తీరు స్థానికతలో పనిచేస్తుందా..? స్థానిక ఎన్నికల్లో సత్తా చాటడమేమో కానీ దిక్కుతోచని స్థితిలో నుంచి రాష్ట్ర నాయకత్వం బయట పడుతుందా..? మోడీ 3.%ూ%. 11 ఏండ్ల పాలన ఫార్ములా తెలంగాణలో పని చేస్తుందా..? చూద్దాం.

బీజేపీ నెక్స్ట్ టార్గెట్‌గా స్థానిక ఎన్నికలు

పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటిన కాషాయ పార్టీ %చీజు నూ=-+జు% స్థానిక సంస్థల ఎన్నికలుగా ఫిక్స్ చేసుకుంది. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల దూకుడుకు చెక్ పెట్టినట్లే.. వచ్చే లోకల్ బాడీ ఎన్నికల్లోనూ సత్తా చాటాలని ప్రణాళికలకు పదును పెడుతోంది. బీజేపీ 11 ఏండ్ల పాలనలో మోడీ ప్రభుత్వం కేటాయిస్తున్న నిధుల వల్ల, సంక్షేమ పథకాల వల్లే గ్రామీణ ప్రాంత అభివృద్ధి సాధ్యమైందనేది ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలనే యోచనలో కాషాయ పార్టీ వర్గాలున్నాయి. మోడీ 3.0 ఫార్ములా గత పార్లమెంట్ ఎన్నికల్లో సక్సెస్ అయ్యేందుకు ఒక కారణంగా పార్టీ నాయకత్వం భావిస్తోంది. ఇక ఇదే ఫార్ములా గత ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బాగా పనిచేసిందని, అదే జోష్ తో మోదీ 11 ఏండ్ల 3.0 ఫార్ములాను వచ్చే ఎనికల్లోనూ అప్లై చేసి స్థానిక ఎన్నికల్లో విజయ దుందుభి మోగించేందుకు కసరత్తులు మొదలు పెట్టారు.

స్థానిక ఎన్నికలపై రాష్ట్రా బీజేపీ వర్క్ షాప్

అందులో భాగంగానే స్థానిక ఎన్నికలపై రాష్ట్రా బీజేపీ వర్క్ షాప్ నిర్వహించుకుంది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వర్క్ షాప్ లో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లు, రాష్ట్ర పదాధికారులు, జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర పొలిటికల్ వ్యవహారాల ఇంచార్జి అభయ్ పాటిల్, బీజేపీ సంస్థాగత రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి సునీల్ బన్సల్ హాజరయ్యారు. స్థానిక ఎన్నికలు, జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక, బనకచర్ల, కాళేశ్వరం వంటి అంశాలతో పాటు ప్రస్తుత రాజకీయ పరిణామాలు, భవిష్యత్ కార్యక్రమాలపై రాష్ట్ర ఇంచార్జుల దశ– దిశ నిర్దేశం చేశారు.

ఏపీకి భారీ కేటాయింపులు, తెలంగాణకు గుండు సున్నా

ఒకవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం అవున్నామనే సంకేతాలు ఇస్తున్నారు సంఘ్ పరివార్ సభ్యులు. అయితే మోదీ పాలనపై పెరుగుతున్న వ్యతిరేకత నుంచి బయటపడ్లేక పోతున్నారనే మాట వినిపిస్తోంది. మోడీ 3.0 లో మాత్రం పొరుగున్న ఉన్న ఆంధ్రప్రదేశ్ కు భారీగా కేటాయింపులు చేసి తెలంగాణకు నిధులు ఇవ్వడకపోవడంతో బీజేపీపై తెలంగాణలో వ్యతిరేకత ఉంది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ నేతలు రోజూ రాష్ట్ర నిధుల అంశంలో బీజేపీని విమర్శనాస్త్రాలతో ఇరుకున పెట్టే ప్రయత్న చేస్తున్నారు. మోడీ 11 ఏండ్ల పాలనలో తెలంగాణకు గాడిద గుడ్డు అంటూ పెద్ద ఎత్తున బీజేపీ డొల్ల తనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో రేవంత్ సర్కార్ స్ట్రాటజీ సక్సెస్ అయ్యిందనే టాక్ ఉంది. ఇక తాజాగా కాళేశ్వరం, అంశంలో ఈటల వ్యవహారం తలనొప్పిగా మారినట్టు తెలుస్తోంది. బనకచర్ల విషయంలో అటు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించలేక, ఇటు సొంత తెలంగాణ ప్రయోజనాలకు అడ్డు చెప్పలేక ముందు నుయ్యి– వెనక గొయ్యి లాంటి పరిస్థితి.



సీఎం రేవంత్ తెలివిగా బనకచర్ల అంశంలో బీజేపీని, బీఆర్ఎస్ ని కార్నర్ చేసేశారనే చర్చ పొలిటికల్ సర్కిల్లో బలంగా సాగుతోంది

కాంగ్రెస్‌కి కౌంటర్ ఇవ్వలేని స్థితిలో బీజేపీ లీడర్స్

ప్రస్తుతం కాంగ్రెస్ నేతల విమర్శలకు కౌంటర్ అటాక్స్ కూడా ఇవ్వలేని పరిస్థితిలో బీజేపీ నేతలు ఉన్నారు. ఒకరిద్దరు నేతలు మినహాయిస్తే ఇతర నేతలెవరూ దీనిపై నోరు మెదపడం లేదు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కౌంటర్లు తప్పితే ఇతర నేతలెవరూ కౌంటర్ అటాక్స్ ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారనిధి ఆ పార్టీ అంతర్గత వర్గాల సమాచారం.. మిగతా ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎత్తుకున్న పాత పాటనే మళ్లీ పాడుతున్నారు. 11 ఏండ్ల నుంచి మోడీ కేటాయిస్తున్న నిధుల గురించే చెబుతున్నారు తప్ప.. పెద్దగా చేసిందేమీ లేదు. అంతేగాక వారి వారి అసెంబ్లీ, పార్లమెంట్ సెగ్మెంట్ల అభివృద్ధిపై మాత్రమే స్పందించి, మిగతా అంశాలను అటకెక్కిస్తున్న పరిస్థితులున్నాయి. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేవలం ప్రెస్ మీట్లకు, ప్రెస్ నోట్లకే పరిమితమయ్యారు. మిగతా ఎంపీలు పూర్తిగా ఎవరి దారి వారిదే అన్నట్టుగా మౌనం వహిస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో రాష్ట్ర నాయకత్వం ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గత ఏడాదిన్నరగా అధ్యక్షుడు ఎన్నికపై నాన్చుడు

ఇక ఎంపీ, ఎమ్మెల్యేల పరిస్థితులు అటుంచితే, సంస్థాగత ఎన్నికలు మరుగున పడ్డాయి, అదిగో పులి, ఇదిగో తోక అన్నట్టు గత ఏడాదిన్నర నుంచి అధ్యక్షుడు ఎంపికపై ఊరిస్తూ వస్తున్నారు. సంస్థాగతంగా ఎన్నికలు పూర్తి చేయలేని బీజేపీ రాష్ట్ర స్థానిక ఎన్నికలను ఎదురుకుంటుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది. కేవలం మత పాచికల మాటున మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్న బిజెపి పరివార్ సభ్యుల ప్రణాళికలు స్థానిక సంస్థల ఎన్నికలను ఎలా పని చేస్తుందో చూడాలంటున్నారు. అంతేకాదు తమ పార్టీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ల నుంచి చేరికలు ఉంటాయి, ఇప్పటికే చాలా మంది నేతలతో సంప్రదింపులు జరుగుతున్నాయని అంటున్నారు. అయితే ప్రజలకు కావల్సింది నిజాలు కాదు– ఇలాంటి బిల్డప్పులే. అవే ప్రస్తుతం ఓట్లు తెచ్చిపెట్టే ఉపాయాలు, అవే పదవులను మోసుకొస్తాయి అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న పరిస్థితుల్లో కమలం పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో వికసిస్తుందా? వికటిస్తుందా? తేలాల్సి ఉంది.

# మందలించినందుకు తల్లినే కాటికి పంపిన బాలిక

హైదరాబాద్, హైదరాబాద్ జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. సొంత కూతురే తల్లిని హత్య చేయించింది. అర్ధరాత్రి ఈ హత్య జరిగింది. హైదరాబాద్ శివారులోని జీడిమెట్లలో జరిగిన తల్లి హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఓ పదో తరగతి చదువుతున్న బాలిక, ఆమె ప్రేమికుడు శివ, అతని తమ్ముడు కలిసి దారుణంగా తల్లి అంజలిని హత్య చేసిన ఘటన ఒక్కసారికి నగరాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ప్రేమకు అడ్డు చెప్పిందనే కారణంతో కన్నతల్లిని పదో తరగతి చదివే కుమార్తె ప్రియుడితో కలిసి హతమార్చింది. మృతురాలు అంజలి.. తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ మునిమనవరాలు కావడం గమనార్హం. పోలీసుల కథనం ప్రకారం.. విద్యార్థినికి కొన్ని రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ యువకుడు పరిచయమయ్యాడు. అతడితో ప్రేమాయణం సాగించిన బాలిక ఇంటి నుంచి వెళ్లి పోయింది. తన కుమార్తె కనిపించడం లేదని తల్లి జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో గత రాత్రి ప్రియుడితో కలిసి బాలిక ఇంటికి వచ్చింది. నిద్రిస్తున్న తల్లి అంజమ్మ గొంతు నులిమి, కర్రతో తలపై కొట్టి చంపినట్టు సమాచారం. ప్రియుడు, అతడి తమ్ముడితో కలిసి బాలిక ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలికను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. అయితే.. ఈ దారుణ ఘటనపై నిందితురాలు తేజ శ్రీ చెల్లి ప్రియచెప్పిన వివరాల మేరకు ..ట్యూషన్ నుంచి వస్తున్న నన్ను మా అక్క గల్లీ లోనే ఆపిందని, అమ్మ ఒక ఐటమ్‌ను తీసుకుని రమ్మంది. పదా వెళ్దాం అని తీసుకెళ్లిందని తెలిపింది. 20 నిమిషాల తర్వాత అక్కా నేను ఇంటికి చేరుకున్నామని, అప్పటికే కిచెన్ లో అమ్మ స్పృహ లేకుండా పడి ఉందని పేర్కొంది. అమ్మను నేను చూసుకుంటా.. నువ్వు బయటకు వెళ్ళి మీ ఫ్రెండ్ ఎవరినైనా తీసుకుని రా.. గల్లీలో ఆంటీ వాళ్లకు ఎవరికీ చెప్పకు అని చెప్పిందని వెల్లడించింది. అంతేకాకుండా.. మా అమ్మ ఇంకా చనిపోలేదు అని తెలుసుకున్న అక్క.. మళ్ళీ శివకి కాల్ చేసిందని, అమ్మ ఇంకా చనిపోలేదు. కాళ్లు చేతులు ఆడిస్తోంది అని చెప్పింది. మళ్ళీ శివ, యశ్వంత్ వచ్చారు. సుత్తితో అమ్మ తలపై కొట్టారు.. చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత వెళ్ళిపోయారు.. నేను అప్పుడే వచ్చాను. చూసే సరికి అమ్మ రక్తపుమడుగులో పడి ఉంది.. వెళ్ళి చేతులు రుద్దాను.. లేపే ప్రయత్నం చేశాను. కానీ అక్క మాత్రం దగ్గరికి కూడా రాలేదు. అమ్మ చనిపోయింది లేపి వేస్ట్ అన్నదని ప్రియ వెల్లడించింది.

# రియల్ మోసంలో వైకాపా నేత తనయుడు

ఒంగోలు, రియల్ ఎస్టేట్ పేరుతో ఘరానా మోసానికి పాల్పడిన విజయవాడ వైసీపీ నేత, మాజీ డిప్యూటీ మేయర్ గోగుల రమణారావు కుమారుడు లక్ష్మీ విజయ్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ స్కీంల పేరుతో విజయ్ చీటింగ్‌కు పాల్పడ్డాడు ఏపీ ఇన్ ఫ్రాన్ పేరుతో 22 రకాల ప్రాజెక్టుల పేర్లు చెప్పి కోట్ల రూపాయలు వరకు ప్రజల నుంచి వసూలు చేశాడు. అయితే పెట్టుబడి పెట్టిన వారికి ప్లాట్లు ఇవ్వకుండా మోసానికి పాల్పడ్డాడు. కాలం గడుస్తున్నప్పటికీ తమకు ప్లాట్లు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితులు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఎట్టకేలకు ఒంగోలులో లక్ష్మీ విజయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో దాదాపు 200 మంది బాధితులను లక్ష్మీ విజయ్ కుమార్ మోసం చేసినట్లు తెలుస్తోంది. వెయ్యి కోట్లు టర్నోవర్ ఉన్న పెద్ద రియల్ ఎస్టేట్ సంస్థ అంటూ జోరుగా ప్రచారం చేశాడు. ఎత్తైన భవనాలు, ఆకర్షణీయ వెంచర్లను చూపి ప్రజలను ఆకర్షించే ప్రకటనలు చేశాడు. పథకాల పేరుతో దగా చేసిన వైనం బయటపడింది. అమ్మకాలు అద్భుతంగా ఉన్నాయంటూ మోసం చేసి ప్రజల నుంచి కోట్లలో వసూలు చేశాడు. విజయ్ కుమార్‌ను నమ్మి అద్భుతమైన ప్లాట్లు సొంతమవుతాయని భావించిన బాధితులు తమ దగ్గర ఉన్నదంతా పెట్టుబడిగా పెట్టేశారు. అయితే ఎన్ని రోజులైనా విజయ్ కుమార్ ప్లాట్లు ఇవ్వకపోవడంతో అతడిని నిలదీశారు. అడిగిన వారిని వాట్సప్ గ్రూపుల్లో తొలగించి, కార్యాలయానికి రాకుండా ఆంక్షలు విధించాడు విజయ్. స్కీమ్–1లో రూ.2 నెలవారి వడ్డీ, స్కీమ్–3లో రూ.3 వడ్డీ మూడు నెలలకు ఒకసారి చెల్లింపులు అంటూ చేతులెత్తేశాడు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ప్రభుత్వం కూడా స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి లక్ష్మీ విజయ్‌ను అరెస్ట్ చేసేందుకు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే కేసు నమోదు అవడంతో పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడు. కానీ చివరకు ఒంగోలులో విజయ్ కుమార్‌ను సైబరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ఇంకా తగ్గలేదు...

ఇస్లామాబాద్:పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ సైనిక చర్య చేపట్టకముందు తీసుకున్న పలు దౌత్యపరమైన నిర్ణయాల్లో సింధూ జలాల ఒప్పందం రద్దు అంశం ఒకటి. దీంతో.. త్వరలో పాక్ గొంతెండుతుందనే కామెంట్లు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో.. పాక్ లో ఈ మేరకు ఆందోళనలు రేగుతున్నాయని అంటున్నారు. ఈ సమయంలో పాక్ కు నీరివ్వకపోతే భారత్ పై యుద్ధమే అంటూ ప్రగల్భాలు పలుకుతోంది పాక్!అవును... సింధు జలాల ఒప్పందం కింద తమకు న్యాయంగా రావాల్సిన నీటి వాటా ఇచ్చేందుకు భారత్ నిరాకరిస్తే తమ దేశం యుద్ధానికి వెళ్తుందని పాకిస్థాన్ విదేశాంగ శాఖ మాజీ మంత్రి, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) అధినేత బిలావల్ భుట్టో జర్దారీ హెచ్చరించారు. ఇదే సమయంలో... సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలనే భారత్ నిర్ణయాన్ని తప్పుబట్టారు. కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా భారతదేశానికి రెండు ఎంపికలు ఉన్నాయని చెప్పిన బిలావల్... జలాలను న్యాయంగా తమతో పంచుకోవడం.. లేదంటే, తాము సింధు పరివాహక ప్రాంతంలోని ఆరు నదుల నుంచి నీటిని తీసుకుంటామని చెప్పారు. సింధూ నదీ జలాల ఒప్పందం ఇప్పటికీ అమలులోనే ఉందని ఆయన అన్నారు. నీటిని ఆపే బెదిరింపు ఐక్యరాజ్యసమితి చార్టర్ ప్రకారం చట్టవిరుద్ధమని చెప్పుకొచ్చారు. ఇదే క్రమంలో... పాకిస్థాన్ తో చర్చలకు భారత్ నిరాకరిస్తే, ఉగ్రవాదంపై సమన్వయం లేకపోతే, రెండు దేశాలలో హింస మరింత తీవ్రమవుతుందని చెప్పిన బిలావల్.. రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాదాన్ని భారత్ ఓ ఆయుధంగా ఉపయోగిస్తోందని విమర్శించారు. కశ్మీర్ సమస్యను ప్రపంచ వేదికపై లేవనెత్తడంలో పాకిస్థాన్ విజయం సాధించిందని చెప్పుకున్నారు. కాగా... ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో

# రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చాం



హైదరాబాద్,దేశ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లికించదగ్గ రోజు, ఈరోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పి రుజువు చేసుకున్నామని అన్నారు. 70 లక్షల మంది రైతులకు తొమ్మిది రోజుల్లో రూ. తొమ్మిది వేల కోట్లు వారి ఖాతాల్లో వేశామని గుర్తు చేశారు. సచివాలయం ముందు ఏర్పాటు చేసిన రైతు భరోసా విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలు త్యాగాలు చేసిన మహాను భావుడు రాజీవ్ గాంధీ అన్నారు. వ్యవసాయం అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే వ్యవసాయమని తెలిపారు. రైతులకు మద్దతు ధర ఇచ్చింది కాంగ్రెస్, రైతులకు నిధులు ఇవ్వాలని చెప్పింది కాంగ్రెస్.. దేశంలో గ్రీన్ రెవల్యూషన్ తెచ్చింది కాంగ్రెస్ అని చెప్పారు. రైతులకు రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని.. భూమి లేని నిరుపేద కుటుంబానికి సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని చెప్పామన్నారు. రైతులకోసం బీఆర్ఎస్ ఏమీ చేయలేదని.. రైతులకు ఇవ్వాల్సిన అన్నింటినీ బంద్ చేసిందని విమర్శించారు. రైతు బంధు పేరుతో అరకొర నిధులు వేశారని ఆరోపించారు. చెప్పిన మాట ప్రకారం తొమ్మిది వేల కోట్ల రైతు భరోసా ఇచ్చిన ప్రజా ప్రభుత్వాన్ని రైతులు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. 'సంక్షోభం నుంచి సంక్షేమం వైపు వెళ్తున్నాము. ఇతర రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయి. రాజీవ్ గాంధీ సూచనల మేరకు ముందుకు వెళ్తున్నాము. కొంతమంది కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారు. 25 లక్షల మందికి రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. మమ్మల్ని విమర్శించే నైతిక హక్కు ఇతర పార్టీలకు లేదు. నాడు మన్మోహన్ సింగ్ చేశారు. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం చేసింది. అప్పటి ప్రభుత్వాలు నెలల తరబడి రైతుబంధు అన్నారు. పూర్తిగా కూడా చేయలేదు. తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా వేశాము. కష్టాలు, ఇబ్బందులు ఉన్నా నిధులు విడుదల చేశాం. పాత పథకాలు ఏవీ తీసివేయలేదు. గ్రామీణ తెలంగాణ మా గుండెల్లో ఉంటుంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా లక్ష కోట్లు రైతులకు ఖర్చు చేశాం. మాకు ప్రజలు ఐదు సంవత్సరాలు ప్రజలు సమయం ఇచ్చారు. మేము ఇచ్చిన హామీలు అన్నింటినీ నెరవేర్చి ప్రజల ముందుకు వెళతాం.' అని మంత్రి తుమ్మల వ్యాఖ్యానించారు.

# జిల్లా పర్యటనలో పిసిసి చీఫ్ షర్మిల



నెల్లూరు,మాజీ సీఎం జగన్ పర్యటనలో సింగయ్య మృతి చెందడం దారుణమని, దీనికి జగన్ బాధ్యత వహించాలని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు.. జగన్ సైడ్ బోర్డు మీద నిలబడి ప్రయాణం చేయడమే తప్పని... జగన్ షేక్ హ్యాండ్ ఇస్తున్న సమయంలోనే సంఘటన జరిగిందన్నారు. ఫేక్ వీడియో అనడం దురదృష్టకరమన్నారు. జిల్లాలో వైఎస్ షర్మిలా రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆకుతోట గిరిజనకాలనీ నుంచి ఇందిరా భవన్ వరకు ర్యాలీగా వెళ్లారు. గాంధీబొమ్మ సెంటర్ వద్ద వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు షర్మిల. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావడం అందరికీ అవసరమన్నారు. జగన్ ప్రతీ విషయంలోనూ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు జనంలోకి వచ్చిన పరిస్థితి లేదని... ఇప్పుడేమో జనసమీకరణతో బలప్రదర్శన చేస్తున్నారన్ని ÷ర్ అయ్యారు. 'జగన్‌కు నిబంధనలు, ఆంక్షలు ఉండవు. మూడు బండ్లు అంటే, ముప్పై బండ్లతో వెళతారు. జగన్ మోదీ దత్తపుత్రుడనా? కార్ల కింద మనుషులని నలుపుకుంటూ పోతూ, మానవత్వం గురించి మాట్లాడుతారా? జగన్‌కు అసెంబ్లీకి వెళ్లి సమాధానం చెప్పే దమ్ము లేదు. రుషికొండలని ఎందుకు గుండుగొరిగారు? మద్యపాన నిషేధం చేస్తామని ఎందుకు కుంభకోణానికి పాల్పడ్డారు?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్‌ను నిలబెట్టడానికి తన అవసరం ఉందని పంపించారని తెలిపారు. తనకు, జగన్‌కు ఉన్న విభేదాలు, రాష్ట్ర సమస్యలతో పోల్చితే చాలా చిన్నవన్నారు. జగన్ సీఎం అయిన వెంటనే తమకు విభేదాలు వచ్చాయన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఒక్కటే పోరాడగలదని స్పష్టం చేశారు. జగన్, వైఎస్ కుమారుడు అయినా మోదీకి దత్తపుత్రుడిగా ప్రతి బిల్లులోనూ బీజేపీకి మద్దతిచ్చారన్నారు. అదానీ, అంబానీలతో పాటు ఎవరికి ఏ మేలు కావాలన్నా చేశారని.. మెడలు వంచుతానని చెప్పి.. తానే మెడలు వంచారంటూ వ్యాఖ్యలు చేశారు. మన రాష్ట్రానికి ఏ మేలూ చేయని పార్టీ బీజేపీ అని విమర్శించారు. పదిహేనేళ్లుగా ఏపీ ప్రజలను బీజేపీ వెన్నుపోటు పొడుస్తుందన్నారు. ఇప్పుడు పోలవరానికి డబ్బులు ఇస్తామంటున్నారని... అయితే పార్లమెంటులో ఒక్క ఎంపీ కూడా పోలవరం ఎత్తు 45 ఉండాలని ప్రశ్నించే వారేలేరన్నారు. న్యూఢిల్లీని మించిన రాజధానిని నిర్మిస్తామన్నారని తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతుకి రూ.20వేలు ఇస్తామని, ఇప్పటికీ ఇవ్వలేదని విమర్శించారు. 80 లక్షల మంది రైతులు ఉంటే, 45 లక్షలకు కుదించారన్నారు. కర్నాటక, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాలు మహిళలకు ఉచిత బస్సు బ్రహ్మాండంగా అమలు చేస్తుంటే, ఏపీలో ఇప్పటికీ అమలు కాలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే ఫించను ఇస్తామన్నారని అన్నారు. 'మిమ్మల్ని ప్రశ్నిస్తున్న మా నాలుకలు మందమా? ప్రజలని మోసం చేస్తున్న మీ నాలుకలు మందమా? వెంటనే అన్ని పథకాలు, హామీలని నెరవేర్చాలని' వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. కాగా.. గాంధీబొమ్మ సెంటర్ వద్ద వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన షర్మిల.. పక్కనే ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించడాన్ని ఏపీసీసీ చీఫ్‌తో పాటు కాంగ్రెస్ నేతలు మరవడం చర్చకు దారి తీసింది.

# రాహుల్‌ను చర్చలకు రావాలంటూ ఇసి లేఖ



న్యూఢిల్లీ,గత ఏడాది మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందంటూ లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ పదేపదే ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో దీనిపై చర్చించేందుకు రావాల్సిందిగా ఆయనను భారత ఎన్నికల కమిషన్ పిలిచింది. జూన్ 12న ఈ మేరకు రాహుల్‌కు ఈసీ లేఖ రాసిందని, ఆయన నివాసానికి లేఖ అందిందని విశ్వసనీయ వర్గాలు మంగళవారంనాడు తెలిపాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, ఎన్నికల ప్రక్రియ సమగ్రతపై అనుమానాలు ఉన్నాయని రాహుల్ ఇటీవల ఆరోపించారు. ఎన్నికల వీడియో ఫుటేజ్, ఫోటోలను ఎన్నికల ఫలితం వెలువడిన 45 రోజుల తర్వాత ధ్వంసం చేయాలని రాష్ట్రాల ఎన్నికల అధికారులను ఈసీఐ ఆదేశించడం తమ అనుమానాలను మరింత బలపరుస్తోందని అన్నారు. అయితే ఈ ఆరోపణలను ఎన్నికల కమిషన్ తోసిపుచ్చింది.ఎన్నికల చట్టాల ప్రకారం ఎన్నికల సరళి రికార్డింగ్ తప్పనిసరి కాదని, పారదర్శకత కోసం ఓటింగ్ ప్రక్రియను రికార్డు చేయిస్తున్నామని ఈసీ తెలిపింది. ఆ వీడియోలను, ఫోటోలను సోషల్ మీడియాలో కొందరు దుర్వినియోగం చేస్తుండటాన్ని గుర్తించామని, ఆ కారణంగానే 45 రోజుల్లోగా ఎలాంటి ఫిర్యాదు రాకపోతే ఫుటేజ్‌లు తొలగించాలని నిర్ణయించామని పేర్కొంది. కాగా, మహారాష్ట్ర ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, ఓట్ల దొంగతనం జరిగిందని రాహుల్ ఇటీవల ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల మధ్య కేవలం ఐదు నెలల్లో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ నియోజకవర్గంలో 8 శాతం ఓటర్లు పెరిగారని, కొన్ని బూత్‌లలో 20 నుంచి 50 శాతం ఓటర్లు పెరిగారని 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. వెర్గి÷డ్ అడ్రస్ లేని ఓటర్లు వేలల్లో ఉన్నట్టు మీడియాలో కథనాలు వచ్చాయన్నారు. ఇది ఓట్ల దొంగతనం కాదా? అని ప్రశ్నించారు. ఆ కారణంగానే తాము మెషీన్ రీడబుల్ డిజిటల్ ఓటర్ల జాబితాను, సీసీటీవీ ఫుటేజ్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు.

# ఆపరేషన్ సింధూర్ లో పాల్గొంటే కేసుల నుంచి విముక్తి లేదు



న్యూఢిల్లీ,ఓ కేసులో నిందితుడిగా ఉన్న ఎన్ఎస్‌జీ (నేషనల్ సెక్యూరిటీ గార్డ్) కమాండోకి సుప్రీంకోర్టు తీవ్ర చురకలు పేల్చింది. దేశం నిర్వహించిన ఆపరేషన్ సింధూర్‌లో తాను పాల్గొన్నానని, అందుకు గాను తనపై ఉన్న హత్య కేసులో మినహాయింపు ఇవ్వాలని కోరగా, కోర్టు తేల్చి చెప్పింది. ఆపరేషన్‌లో పాల్గొన్నంత మాత్రాన నేరం నుండి విముక్తి ఇవ్వలేమని స్పష్టంచేసింది.పంజాబ్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి బ్లాక్ క్యాట్ కమాండోగా పనిచేస్తున్నాడు. అతనిపై భార్యను వరకట్నం కోసం హత్య చేశాడని 2004లో కేసు నమోదైంది. ట్రయల్ కోర్టు విచారణ జరిపి అతనికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. ఆ తర్వాత హైకోర్టులో అప్పీల్ చేసినప్పటికీ అక్కడ కూడా అదే తీర్పు వచ్చింది.అయితే తాజాగా ఆపరేషన్ సింధూర్ పేరుతో అతను సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఆ ఆపరేషన్‌లో తాను కీలక పాత్ర పోషించానని, అందువల్ల తనపై నమోదైన హత్య కేసు నుండి మినహాయింపు ఇవ్వాలని కోరాడు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. "దేశ సేవ నోబెల్ డ్యూటీ అయినప్పటికీ, నేరానికి ఇది రక్షణ కాదు. ఇది అత్యంత దారుణమైన ఘటన. మీపై నమోదైన కేసులో మీరు ఎదుర్కొనాల్సిందే" అని కోర్టు స్పష్టం చేసింది.ఈ తీర్పుతో దేశ సేవలో ఉన్నవారు కూడా వ్యక్తిగతంగా చేసే తప్పులకి శిక్ష తప్పదని, న్యాయ వ్యవస్థ కఠినంగా వ్యవహరిస్తుందని కోర్టు మరోసారి తేల్చిచెప్పినట్టు అయ్యింది.

# టూర్ వార్ ని పీక్స్ కి చేర్చబోతున్న జగన్!



అమరావతి,ఏపీలో టూర్ వార్ నడుస్తోంది. వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ టూర్లు చేస్తూంటే అది వార్ గా మారుతోందా లేక మారుస్తున్నారా అన్న చర్చ అయితే పెద్ద ఎత్తున సాగుతోంది. అంతకు ముందు రాప్తాడు, ఆ తరువాత తెనాలి, నిన్న పొదిలి, నేడు రెంటపాళ్ళ ఇలా జగన్ ఎక్కడికి వెళ్ళినా అది వివాదం అవుతోంది. ఒక పార్టీ నాయకుడిగా ప్రజా సమస్యల మీద ప్రజల దగ్గరకు వెళ్ళే హక్కు తమకు లేదా అని వైసీపీ అధినాయకత్వం ప్రశ్నిస్తోంది.అదే సమయంలో ఘర్షణల కోసమే టూర్లు చేస్తున్నారు అని అధికార పక్ష కూటమి విమర్శిస్తోంది. అంతే కాకుండా జగన్ టూర్లకు వెళ్ళిన చోట కూడా అనుకోని సంఘటనకు చోటు చేసుకుంటున్నాయి. రాప్తాడు పర్యటనకు వెళ్తే జగన్ వచ్చిన హెలికాప్టర్ మీద దాడి జరిగింది అన్నారు. జనాలను కంట్రోల్ చేసేందుకు పోలీసులను అవసరమైనంతగా పెట్టలేదని అన్నారు. అయితే వైసీపీ నేతలు క్యాడర్ వల్లనే అలాంటివి జరిగాయని ఎక్కువ మందితో జనసమీకరణ చేయడం ద్వారానే ఇలాంటివి చేస్తున్నారు అని కూటమి బదులిచ్చింది.తెనాలిలో సైతం భారీగా జనాలతో రావడంతో గందరగోళం ఏర్పడింది అని విమర్శలు అధికార కూటమి నుంచి వచ్చాయి. పొదిలిలో అయితే ఏకంగా పోలీసుల మీద మహిళల మీద వైసీపీ కార్యకర్తలు దాడులు చేసారు అని కేసులు కూడా కట్టారు. ఇక రెంటపాళ్ళ పర్యటనలో ఏకంగా జగన్ మీదనే కేసు ఫైల్ అయింది ఆయన ప్రయాణిస్తున్న కారు కిందన ఓ వృద్ధుడు పడి ప్రాణాలు పోగొట్టుకున్నారు అని వీడియో తాజాగా బయటకు రావడంతో అది రాజకీయ రచ్చగా మారింది.ఈ నేపథ్యంలో పార్టీ ముఖ్య నేతలతో పాటు సీనియర్లతో జగన్ ఒక కీలకమైన సమావేశాన్ని ఈ నెల 25న తాడేపల్లిలోని తన ఆఫీసులో నిర్వహిస్తారు అని అంటున్నారు. ఈ సమావేశం ద్వారా జగన్ సంచలన నిర్ణయం తీసుకుంటారు అని అంటున్నారు. జూలై 8న వైఎస్సార్ జయంతి వేడుకలు ఉన్నాయి.ఆ రోజు నుంచి జగన్ జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడతారు అని అంటున్నారు. ఇలా వారానికి పది రోజులకు ఒక టూర్ చేస్తూంటే వివాదాలు సృష్టిస్తున్నారు అని వైసీపీ ఆరోపిస్తోంది. తమ నేతను ఇక జనాలకు దూరం చేయడంతో పాటు బయటకు తిరగకుండా కట్టడి చేసే ఎత్తుగడ కూడా ఉందని అనుమానిస్తోంది. దాంతో దానిని విరుగుడుగా జగన్ నిరంతరం జనంలో ఉండేలా వైసీపీ ప్లాన్ చేస్తోంది అని అంటున్నారు.ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండవ ఏడాది అయిన నేపథ్యంలో జనంలో వ్యతిరేకత మెల్లగా పెరుగుతోందని దాంతో జనం మధ్యనే వెళ్ళి ప్రభుత్వాన్ని నిలదీస్తే ఫలితం ఉంటుందని వైసీపీ భావిస్తోంది. అంతే కాదు జనం మధ్యలో జగన్ ఉంటే రేపటి రోజున ఆయనను అరెస్ట్ చేయాలని చూసినా వచ్చే స్పందన వేరే లెవెల్ లో ఉంటుందని అంటున్నారు.మొత్తానికి చూస్తే జగన్ టూర్ల మీద కూటమి వేసే స్కెచ్ లకు పై ఎత్తు వేయాలని జగన్ వరసబెట్టి జిల్లా టూర్లకు రెడీ కావడమే మంచిదని పార్టీ నేతలు అంటున్నారు. జగన్ సైతం అదే ఆలోచనలో ఉన్నారని చెబుతున్నారు. దీనిని సంబంధించి పార్టీ నిర్వహించే కీలక సమావేశంలో నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు. జగన్ జిల్లా టూర్ల ప్రకటన వస్తే కనుక కూటమి వర్సెస్ వైసీపీ అన్న రాజకీయ యుద్ధం మరింతగా పెరుగుతుందా అన్నది చర్చగా ఉంది.

# జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ రహస్య సర్వే...




హైదరాబాద్,తెలంగాణలో అనుకోకుండా జరగనున్న ఉప ఎన్నిక జూబ్లీహిల్స్. ఈ నియోజకవర్గం తెలంగాణ రాజధాని హైదరాబాద్ లో ఉన్నా.. ఆంధ్రా ఓటర్లదే ప్రభావం. ఇటీవల ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఈ ఏడాది ఆఖరులోగా ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. బహుశా బిహార్ అసెంబ్లీతో పాటే ఉప ఎన్నిక జరిగే అవకాశం కనిపిస్తోంది. ఇది బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం. 2023 ఆఖరులో జరిగిన ఎన్నికల్లో పరాజయం పాలై ప్రతిపక్షంలో ఉన్న ఆ పార్టీ 2024 లోక్ సభ ఎన్నికల్లో చరిత్రలో తొలిసారిగా ఒక్క సీట్లోనూ విజయం సాధించలేదు. అదే సమయంలో జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నికలోనూ ఓడిపోయి ఓ సిటింగ్ స్థానాన్ని కోల్పోయింది. అందుకని ఇప్పుడు జూబ్లీహిల్స్ పై ప్రత్యేక ఫోకస్ పెట్టింది.కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఉన్న లాస్యప్రియ అనూహ్యంగా రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఉప ఎన్నికలో సానుభూతితో గెలవొచ్చని బీఆర్ఎస్ భావించింది. కానీ, అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ విజయం సాధించారు. అందుకనే.. జూబ్లీహిల్స్ లోనూ సానుభూతి వర్కవుట్ అవుతుందా? ఉప ఎన్నికలో ఎవరికి ఓటు వేస్తారు? తదితర ప్రశ్నలతో సర్వే చేస్తోంది. ఇది రహస్యంగా చేస్తోందని సమాచారం.అసలే మరో సిట్టింగ్ స్థానంలో కూడా ఓడిపోతే పార్టీపై తీవ్ర ప్రభావం పడుతుందని బీఆర్ఎస్ నాయకత్వం ఆందోళన చెందుతోంది. జూబ్లీహిల్స్ లో ఎలాగైనా గెలిచి.. వచ్చే మూడేళ్లలో జరిగే ఎన్నికలకు తాము బలంగా ఉన్నామన్న సంకేతాలు పంపాలని చూస్తోంది. ఇక రహస్య సర్వేలో ఉప ఎన్నికలో మీరు ఎవరికి ఓటు వేస్తారు? మాగంటి గోపీనాథ్ భార్య సునీతను నిలిపితే గెలుస్తారా? సానుభూతి ఓట్లు పడతాయా? అన్న వివరాలు సేకరిస్తోంది. ఈ సర్వే నివేదిక ద్వారానే బీఆర్ఎస్ ముందకెళ్లేందుకు సిద్ధం అవుతోందని చెబుతున్నారు. కాగా, అధిష్ఠానం సర్వే ద్వారా ముందుకెళ్తోంటే.. బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్నవారు తమ ప్రయత్నాలు తాము చేసుకుంటున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసింది

దుగ్గొండి, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసింది అని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సూకినే రాజేశ్వర్ రావు విమర్శించారు. మంగళవారం గిర్నిబావి సెంటర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతాంగానికి ప్రతి ఎకరాకు 19,000 వేల రూపాయలు చెల్లించకుండా ప్రభుత్వం బాకి పడిందన్నారు. గత శాసన సభ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఎకరాకు రూ.15,000 ఇస్తామని చెప్పి రైతులను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని గొప్పలు చెప్పి సగం మంది రైతులకు కూడ రుణ మాఫీ వర్తించలేదని ఎద్దేవా చేశారు.సన్నాలకు బోనస్ కూడా ఇప్పటి వరకు ఒక్క రైతుకు ఇవ్వలేదని అలాంటప్పుడు ఎలా సంబురాలు చేసుకుంటారని ప్రశ్నించారు. రాష్ట్రంలోనే ప్రతి కౌలు రైతుకు ఎకరాకు 12,000 రూపాయలు ఎక్కడ ఇవ్వలేదని తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచిన కాంగ్రెస్ పార్టీని రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతులు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నం మొగిలి, నర్సంపేట యూత్ కన్వీనర్ శానబోయిన రాజకుమార్, మాజీ ఎంపీపీ కాట్లా కోమల భద్రయ్య, క్లస్టర్ ఇంచార్జి కంచారకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, గుండెకారి రంగరావు, ఖంపెల్లి రజినీకర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరుల పాల్గొన్నారు.



# ఎమర్జెన్సీకి 50 ఏళ్లు.. మోడీ వార్షికోత్సవం!



న్యూఢిల్లీ,రాజకీయాల్లో ప్రత్యర్థుల బలహీనతే అధికారంలో ఉన్నవారికి ఆయువుపట్టు. ఈ విషయంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారు మరింత దూకుడుగా ఉంది. కాంగ్రెస్‌ను అధికారంలోకి రాకుండా.. ఎక్కడ ఎలా నిర్వీర్యం చేయాలో తెలిసిన నాయకుడిగా ప్రధాని మోడీ రాజకీయ వ్యూహాలకు ఎప్పటికప్పుడు పదును పెడుతూనే ఉన్నారు. ఈ క్రమంలో తాజాగా.. కాంగ్రెస్‌ను కట్టడి చేసేందుకు ప్రధాని మోడీ ఎమర్జెన్సీ ఆయుధానికి పదును పెంచారు.1975, జూన్ 25న అప్పటి ప్రధాని ఇందిరమ్మ దేశంలో ఎమర్జీని విధించి.. ప్రజల ప్రాథమిక హక్కులపై ఉక్కుపాదం మోపారు. తనను విభేదించిన నాయకులను, పత్రికా సంపాదకులను కూడా జైళ్లలోకి నెట్టా రు. అప్పట్లోనే కాదు.. ఇప్పటికీ.. ఈ ఎమర్జెన్సీ భారత రాజకీయ చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా చెబు తారు. అప్పటి ప్రధాని ఇందిరమ్మ ఎన్ని మేళ్లు చేసినా.. ఈ ఒక్క నిర్ణయంతో అవన్నీ తుడిచి పెట్టుకు పోయి.. ప్రత్యర్థులకు అవకాశం ఇచ్చిన ఘట్టం కూడా ఇదే.తాజాగా దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని ప్రధాని మోడీ.. కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏడాది పాటు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఆనాడు జరిగిన అరాచకాలపై ప్రజల్లో చర్చ పెట్టేందుకు సిద్ధమయ్యారు. నిన్న మొన్నటి వరకు 11 సంవత్సరాల తన పాలనపై బీజేపీ నాయకులు ఎలా ప్రచారం చేశారో.. ఇప్పుడు వారే.. ఈ కార్యక్రమానికి కూడా నడుం బిగిం చనున్నారు. ఈ మేరకు ప్రధాన మంత్రి బీజేపీకి దిశానిర్దేశం చేశారు.

### ఏం చేస్తారు?

బీజేపీ నాయకులు నాటి ఎమర్జెన్సీని ప్రజలకు వివరించి.. కాంగ్రెస్‌పై మరింత వ్యతిరేకత పెంచనున్నా రు. ప్రసంగాలు.. నాటి నిర్ణయాలు.. అప్పట్లో ఇబ్బందులు పడిన వారి ఇంటర్వ్యూలను ప్రచారం చేస్తారు.ం ఇతర సామాజిక మాధ్యమాల్లో నాటి ఎమర్జెన్సీకి సంబంధించిన చిత్రాలు, వీడియో లను జోరుగా వైరల్ చేస్తారు. సభలు సమావేశాలు నిర్వహించి.. కాంగ్రెస్ ను తూర్పారబట్టనున్నారు.

## జూలై 1నుంచే అమల్లోకి కొత్త రేట్లు

న్యూఢిల్లీ,రైల్వే ప్రయాణికులకు ఇది షాకింగ్ న్యూస్. జూలై 1వ తేదీ నుంచి రైల్వే టికెట్ ధరలు పెరగనున్నాయి. నాన్ ఎసి మెయిల్/ఎక్స్‌ప్రెస్ ట్రైన్ టికెట్ ధరపై కిలోమీటర్‌కు పైసా, ఎసి తరగతి టికెట్ ధర కిలోమీటర్‌కు రెండు పైసలు పెరగనుంది. ఈ విషయాన్ని కొన్ని మీడియా సంస్థలు వెల్లడించాయి. దీనిపై అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది.

Printed, Published & Owned by MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From SPOORTHI PUBLICATIONS, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: MEDE SHANTHI KUMAR.